క్లుప్తంగా

ముత్యాలమ్మకు బోనాలు



మంగపేట : శ్రావణ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ గుర్రాల ప్రశాంత్‌రెడ్డి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అఖిల, మానుపెల్లి వేణు, పల్లపు హరీష్, భాగ్యమ్మ, దశాలమ్మ, స్వరూప, శివసత్తులు పాల్గొన్నారు.

హర్షణీయం



ములుగు రూరల్ : 'రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష పరిష్కారం'లో భాగంగా జిల్లాలోని 59 పాఠశాలలను ఎంపిక చేయడం హర్షణీయమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న హత్యాచారాల నిరోధానికి పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించాలని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు బీజేవైఎం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చామన్నారు. మొత్తం 5,748 పాఠశాలలకు గాను 59 పాఠశాలను ఎంపిక చేశారని అన్నారు.కార్యక్రమంలో నాయకులు భాను, మహేష్, విక్రాంత్, ప్రశాంత్, దిలీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'పెసా' గ్రామసభతో సమస్యలు పరిష్కారం

ఏటూరునాగారం : మండలంలోని ఏజెన్సీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి పెసా గ్రామ సభను వేదికగా చేసుకోవాలని భూమిపుత్ర గిరిజన సంఘం గ్రామ అధ్యక్షుడు గండెపల్లి సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, భూసమస్యలు, పథకాల విషయంలో ఐక్యంగా సమష్టిగా పరిష్కరించాలన్నారు. అందుకోసం సమస్యలుంటే భూమిపుత్ర సంఘానికి తెలపాలన్నారు. కార్యక్రమంలో సరిత, గంగా, సాగర్, భరత్, లావణ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వాజేడు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఈమేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వైద్యసిబ్బంది జ్వరాల తీవ్రతపై ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఇంటి పరిసరాల్లోని పాత వస్తువులు, టైర్లల్లో ఉన్న నీటిని పారబోశారు. జ్వరం వస్తే తప్పని సరిగా ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ములుగు రూరల్ : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. మండలంలోని బండారుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా హక్కు, బాల్య వివాహలు, ర్యాగింగ్ నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు.బానోత్ స్వామిదాస్, రాజ్‌కుమార్, హెచ్‌ఎం వీరేశ్వర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీనామా

గోవిందరావుపేట : బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడికి శనివారం అందజేశానని తేజరాజు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని, కార్యకర్తగా కొనసాగుతానని చెప్పారు.

ఆదివాసీ రైతుల నీటి వాటా ఏది?

ఏటూరునాగారం : దేవాదుల, తుపాకులగూడెం ప్రాజెక్టుల్లో ఆదివాసీలకు ఎంత వాటా ఇచ్చారని, ఆ విషయంపై ఎందుకు స్పందించడం లేదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోవిందరావుపేట: మేడారం వెళ్లకుండా పస్రా వద్ద బారికేడ్ల ఏర్పాటు



మంగపేట: కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



గోవిందరావుపేట: పస్రా-తాడ్వాయి మధ్య జాతీయ రహదారి పై..





వెంకటాపురం(కె): కూలిన ఇంటి వద్ద అధికారులు



ఏటూరునాగారం: చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



ఎస్ఎస్‌తాడ్వాయి: చెట్టును తొలగిస్తున్న పొక్లెయినర్

లోతట్టు ప్రాంతాలు జలమయం

- జలదిగ్బంధంలో ఏజెన్సీ గ్రామాలు
- వరంగల్-ఖమ్మంకు రాకపోకలు బంద్
- ముమ్మరంగా పోలీసుల సహాయక చర్యలు



మంగపేట: కొత్తూరుమొట్లగూడెం వద్ద వరదలో మునిగిన వరి పొలాలు



గోవిందరావుపేట: పస్రా ఇళ్లలోకి వస్తున్న వరద

ఏటూరునాగారం : భారీ వర్షాలతో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కొండాయి, మల్యాల, కొండాయి కొత్తూరుకు పూర్తిగా రాకపోకలు బంద్ అయ్యాయి. వర్షాల కారణంగా జంపన్నవాగు ఉప్పొంగడంతో వాగుదాటే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే ఎలిశెట్టిపల్లి వద్ద వాగు ఉప్పొంగడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఏటూరునాగారం-బూర్గంపాడ్ రహదారి మధ్యలోని జీడివాగు వద్ద పాలవాగు, జీడివాగు సైతం ఉప్పొంగి రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. వాహనదారులు భయాందోళనతో రాకపోకలను వాయిదా వేసుకుంటున్నారు.

ఐటీడీఏలో కంట్రోల్ రూం ఏర్పాటు

మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో వరదల కారణంగా సహాయక చర్యలు అందించడానికి 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 63098 42395, 08717293246 సమాచారం ఇవ్వాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జగదీశ్ సూచించారు. శనివారం మండలంలోని దొడ్ల, కొండాయి ప్రాంతాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. వర్షాలకు రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాను పునరుద్ధరించారు. వాగులోకి ఎవరు వెళ్లొద్దన్నారు. ఎలిశెట్టిపల్లి, దొడ్ల, కొండాయి, మల్యాల గ్రామాల ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. గోదావరిలోకి పడవలు, చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సతీష్ ఉన్నారు.

కూలిన ఇల్లు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని మొర్రవానిగూడెంలో మల్లమ్మకు చెందిన ఇల్లు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉధృతంగా యాసంగితోగు..

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని వెంగ్లాపూర్ సమీపంలోని యాసంగితోగు శనివారం సాయంత్రం రోడ్డుపై వరద ఉప్పొంగొంది. వర్షాలకు తోగు వరద రోడ్డుపై ప్రవహించడంతో వెంగ్లాపూర్ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అప్పటికే అక్కడి చేరుకున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వరద ఉధృతంగా రోడ్డుపై రావడంతో వాగు అవతల ఉన్న కొంత మందిని వరదలో నుంచి బయటకు దాటించారు. యాసంగి తోగు వరద రోడ్డుపైకి భారీగా రావడంతో ఎవరూ కూడా వరదలో నుంచి దాటే ప్రయత్నం చేయొద్దని ఎస్సై ప్రయాణికులకు సూచించారు.

రోడ్లపై చెట్లను తొలగించిన పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలోని శనివారం భారీ వర్షం కురవడంతో రోడ్లపై పదుల సంఖ్యలో చెట్లు విరిగి పడ్డాయి. తాడ్వాయి-పస్రా నుంచి వెళ్లే దారిలో కొండపర్తి సమీపంలో రోడ్డుపై నాలుగు చెట్లు విరిగి పడడంతో తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి చెట్లను తొలగించారు. అనంతరం కొద్ది నిమిషాల్లోనే కొండపర్తి సమీపంలోని వట్టివాగు వద్ద రెండు లారీలపై చెట్టు పడింది. దీంతో పోలీసులు లారీపై పడిన చెట్లను తొలగించారు.తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే దారిలో, ఏటూరునాగారం వెళ్లే దారిలో కూడా రోడ్డుపై చెట్లు పడ్డాయి. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చెట్ల తొలగింపు కోసం పోలీసు సిబ్బందిని టీంల వారీగా ఏర్పాటు చేసి వాటిని తొలగించారు. రోడ్ల భవనాల శాఖ అధికారులు రోడ్లపై చెట్లను తొలగించాల్సి ఉన్నప్పటికీ శ్రమించి ఓపికగా చెట్లను తొలగింపునకు పాటుపడిన పోలీసులను ప్రయాణికులు అభినందించారు.

గోవిందరావుపేట : మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లోని రహదారులు, పస్రా గ్రామంలోని లోతట్టు ప్రాంతం అభ్యుదయ కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు వచ్చి జలమయమయ్యాయి. పస్రా, తాడ్వాయి మధ్య గల జలగలవంచవాగు పొంగింది. జాతీయ రహదారి పై చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

నీట మునిగిన వరిపంట

మంగపేట : మండలంలో రెండ్రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో కోమటిపల్లి, కొత్తూరు మొట్లగూడెం, బొమ్మాయిగూడెం అటవీ ప్రాంతంలోని బొమ్మాయిగూడెం, గౌరారం వాగులు శనివారం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాగుకు దిగువన ఉన్న లోతట్టు ప్రాంతంలో వరద నీరు పోటెత్తింది. వరదల వల్ల కోమటిపల్లి, కొత్తూరుమొట్లగూడెం గ్రామాల రైతులకు చెందిన సుమారు 50 నుంచి 70 ఎకరాల మేర ఇటీవల వే సిన వరి పంట నీట మునిగాయి. శనివారం సా యంత్ర వరకు కొంత మేర వాగు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతంలో వర్షం ప డితే మరింత వాగు ఉధృతి పెరిగి వరి పైరు కొ ట్టుకు పోవడంతో పాటు ఇసుక మేటలు ఏర్పడే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గౌరారం వాగు ఒడ్డుకు కోత

మంగపేట మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగపేట గౌరారం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బోరునర్సాపురం గ్రామానికి అనుకుని ఉన్న వాగు ఒడ్డు వరద ఉధృతికి కోతకు గురై గ్రామానికి అతిసమీపంలోకి వస్తుండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రెండ్రోజుల నుంచి ఒడ్డు కోతకు గురవుతున్న విషయం తెలుసుకున్న ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, ప్రమోద్ శనివారం గ్రామస్తులతో కలిసి కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇదే విధంగా ఒడ్డు కోతకు గురైతే మున్ముందు ఒడ్డు వెంట ఉన్న జనావాసాలు, సాగు భుములు వాగులో కలిసి పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి వీలైనంత రివిట్‌మెంట్ నిర్మించాలని కోరారు. వాగు ఒడ్డు కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించామని రివిట్‌మెంటు నిర్మాణం చేపట్టేందుకు ఎస్టిమేట్ నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు గ్రామస్తులకు తెలిపారు.

సీపీఎస్ రద్దు కోసం పోరాడాలి



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

ములుగు రూరల్ : సెప్టెంబర్ 1వ తేదీ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ మడుగూరి నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీపీఎస్ విధానం రద్దుపై ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ సెంటర్, గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏళ్ల మధుసూదన్, అన్నవరం రవికాంత్, గుల్లగట్టు సంజీవ, మంకిడి రవి, పోరిక సునీల్, సారయ్య, మక్బూల్‌పాషా, సమ్మయ్య, వీరస్వామి, పవన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

బస్సును బయటకు లాగారు



వాజేడు : వాజేడు, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన శుక్రవారం రాత్రి బస్సు బురదలో దిగబడిన విషయం విదితమే. కాగా శనివారం ఉదయం డోజర్ ట్రాక్టర్ సాయంతో దిగబడిన బస్సును బయటకు తీశారు. రాత్రి బస్సులో ఉన్న ప్రయాణికులు తమ బంధువుల ఇళ్లకు వెళ్లి బస చేశారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న వెంకట్రాములు

ములుగు: /ములుగు రూరల్ : కార్మికులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని బీకేఎంయూ(భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంట్రాములు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకుల విధానాలతో వ్యవసాయ కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పని దినాలను కల్పించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.6లక్షల నిధులు అందించాలని అన్నారు. వ్యసాయ కార్మికులు ఐక్య ఉద్యమాలను సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రవీందర్, ఇంజం కొమురయ్య, అమ్జద్‌పాషా, రాజు, బండి నర్సయ్య, రమేష్, నరేష్, రవి, సమ్మయ్య, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే గుర్తింపు

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఏటూరునాగారం : ప్రతీ ఉద్యోగికి ప్రజలకు అందించిన సేవలతోనే తగిన గుర్తింపు వస్తుందని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఎల్ఆర్ ప్రసాద్ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం ఐటీడీఏలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ వారిని సన్మానించి మాట్లాడారు. ఉద్యోగంలో వ్యక్తులు ప్రజలకు సేవలు అందించడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఐటీడీఏ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి



టీవీఆర్ సూరి,ఎస్సై

మంగపేట : మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాటు చేసే వినాయకుడి ప్రతిమల ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత అనుమతి జారీ చేస్తామన్నారు. గణేష్ మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, స్థలం కోసం సంబంధిత శాఖ అధికారుల అనుమతి, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. షార్ట్ సర్క్యూట్ జరగకుండా నాణ్యమైన వైర్లను ఉపయోగించాలన్నారు. నిర్వాహకులు, మండపాల కమిటీ వివరాలు, బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని ఎట్టి పరిస్థితుల్లో మండపాల వద్ద డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పందంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్-100కు ఫోన్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కులగణన చేసి ఎన్నికలు నిర్వహించాలి



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బాధ్యులు

వాజేడు : బీసీ కుల గణన చేసిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ అన్నారు. మండల పరిధిలోని రాంపురం గ్రామంలో శనివారం ఓడ బలిజ సేవా సంఘం గ్రామ కమిటీల ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిక్‌లో పుట్టిన గోదావరి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సాపురం వద్ద సముద్రంలో కలిసే వరకు 1,450 కిలో మీటర్ల గోదావరి ఉందని, దాని పరివాహకం వెంట లక్షలాది ఓడ బలిజ కుటుంబాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఓడ బలిజ కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చింతూరి రమేష్, కొప్పుల రమణయ్య, గగ్గురి రమేష్, బద్ది ఆదినరాయణ, కొప్పుల రఘుపతి, గార నాగార్జున తదితరులున్నారు.

గ్రామ కమిటీలు

రాంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొల్లె నరేష్, పేరూరు గ్రామ అధ్యక్షుడిగా తూనూరు చంటి, చిన్న గొళ్లగూడెమ గ్రామ అధ్యక్షుడిగా బొల్లె ఆదినారాయణను ఎంపిక చేసి వారిని శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య కోరారు. హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆదివాసీ సంఘాల ఉద్యమ పోరాట ఫలితంగానే మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాత సబ్ జైల్ భవనాన్ని విద్యార్థులకు తాత్కాలిక వసతి గృహంగా ఇవ్వాలని కోరారు. గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సాయి, జిల్లా అధ్యక్షుడు గణేష్ ఉన్నారు.

మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగు

వాజేడు : భారీ వర్షాల కారణంగా రైతులు మిర్చి మొక్కలు నాటి సాగు చేస్తున్నారు. శనివారం మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో నర్సరీ పద్ధతిలో పెంచిన మిర్చి నారును రైతులు మల్చింగ్ షీట్‌లో మొక్కలు నాటుతున్నారు.

బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి



మాట్లాడుతున్న మహేందర్

ములుగు రూరల్ : మండలంలోని సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య గల బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొగ్గుల వాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గుల వాగు ఉప్పొంగిన ప్రతిసారి జగ్గన్నగూడెం గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం స్పందించి బొగ్గుల వాగుపై వంతెన నిర్మించాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క గిరిజన గ్రామాలకు వంతెన నిర్మించకపోవడం శోచనీయమని అన్నారు. వంతెన నిర్మించని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీబీఎస్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, సారక్క, రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మంగపేట: నివాళులర్పిస్తున్న గోవింద్ నాయక్



ఏటూరునాగారం : రొయ్యూర్‌లో..

మంగపేట : మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కోరుకొప్పుల సత్యం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ పరామర్శించి, సత్యం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రూ.3,000 నగదు అందజేశారు. ఆయన వెంట సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని తిమ్మంపేటకు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పూజారి సతీష్ విషజ్వరంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న గోవింద్ నాయక్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.5,000 నగదు అందజేశారు.

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్‌కు చెందిన సంద సమ్మక్క ఇటీవల మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. అలాగే పాగిడి పోషయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి, 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిటమట రఘు,ఖలీల్, నర్సింహారావు, పోషయ్య, మధుబాబు, గౌస్‌పాషా, రామయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



శిరీష (ఫైల్)

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన తూర్పాటి మొగిలి తన కుమార్తె శిరీషను (23) రెండేళ్ల కిందట వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన పత్తి మోహన్‌తో వివాహం చేశారు. రెండు నెలలు కాపురం అనంతరం వీరిలో అనుమానం మొదలై, గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో పెద్దమనషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించిన మోహన్‌లో మార్పు రాలేదు. విసిగిపోయిన శిరీష చల్వాయిలోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది.